# 29. మహారాజ మోసం

లార్డ్ కర్జన్ మహాశయుడు బ్రిటిష్ ప్రభుత్వం తరఫున భారత దేశంలో వైస్రాయిగా ఉంటూన్న దుర్దినాల్లో... మన సూర్య, చంద్ర వంశీకులైన మహారాజులంటే ఆయనకు మహా కడుపుమంటగా ఉండేది.

ఈ మహారాజులు మహా వైభోగంతో బ్రతుకుతూండటం, యూరోపియన్ దేశాల్లో వీరు అడుగుపెడితే వీరి పరిచయ భాగ్యం కోసం, వీరిచ్చే విందులకోసం ప్రభు కుటుంబాలవారే ఎగబడుతూండటం ఆయనకు వెగటు పుట్టించేది. భారతీయ రాజులకూ, మహారాజులకూ అప్పటికే విదేశాల్లో గొప్పగొప్ప రాచ వంశీకులతో దగ్గరి చుట్టరికాలు ఏర్పడి పోయాయి కూడా.

మన మహారాజుల వైభోగం ఎలాంటిదంటే వేసవికాలపు సిమ్లా విడుదుల్లో కొందరు మహారాజులు ఏర్పాటుచేసే విందులకు హాజరవటానికి సాక్షాత్తూ వైస్రాయి సతీమణి కూడా ప్రత్యేకాసక్తి చూపేది.

ఓసారి ఓ మహారాజుగారు మరో ఇద్దరు ఆత్మీయులైన మహారాజుల్తో కలసి ఘనమైన విందుచేసి సాక్షాత్తూ వైస్రాయ్ లార్డ్‌కర్జన్ సతీమణిని ఒక త్రైనూ ఆ విందుకు ఆహ్వానించేరు. అవిడకూడా సంతోషంగా సపరివారంగా వేంచేయగా... !

ఆ మహారాజులు విందుకు ముందు ఆవిడను తమ స్త్రీ జనంచేత బట్టలూడదీయించి చీరకట్టింపించి, చరిత్ర ప్రఖ్యాతమైన రత్నాభరణాలు, కిరీటం ఇత్యాదుల్తో మహారాణిలా అలంంరింపచేసి ఫోటోలుతీయించి ఆనందించేరు. ఆ తర్వాత విందులో తిని, తాగి సుఖించేరు.

అయితే...

వారి దురదృష్టంకొద్దీ ఆ ఫొటో కొన్ని బ్రిటిష్ పత్రికలకు చేరి అచ్చయిపోయింది.

అది చూసిన కర్జను మహాశయుడు అగ్రహోదగ్రుడై దేశంలోను, విదేశాల్లోనూకూడా భారతీయ మహారాజుల కార్యకలాపాలపై పరిమితులు విధిస్తూ ఆర్డర్లు జారీచేసేడు.

ఫలితంగా ఎవరు ఎక్కడికి వెళ్ళి జల్సాచేయాలన్నా వైస్రాయి పర్మిషన్ తప్పనిసరి అయిపోయింది.

ఇలాంటి పరిస్థితుల్లో కపూర్తలా సంస్థానాధీశులు హిజ్ హైనెస్ మహారాజా జగత్‌జిత్ సింహజీవారు నానాప్రయాసాపడి యూరప్‌యాత్రకు అనుమతి సంపాదించేరు. అయితే శ్రీవారివెంట బహుకొద్దిమంది పరిచారకులను తప్ప కనీసం మహారాణీని సైతం తీసుకువెళ్ళేందుకుససేమిరా వీల్లేదన్నాడు వైస్రాయి మహాశయుడు.

ఆ సమయంలో శ్రీవారి మహారాణి కనరీదేవి. ఆవిడ అతిలోక సౌదర్యవతి. చల్లని కులూ లోయల్లో పుట్టిపెరిగిన రాజపుత్ర కన్య. ఆవిడంటే మహారాజా జగత్‌జిత్ సింహజీవారికి పంచప్రాణాలు. అసలు ఆవిడకు అతిలోక భోగాలు రుచిచూపటం కోసమనే శ్రీవారు యూరఫ్ యాత్రకు ప్రణాళికలు వేసేరు. కానీ, వైస్రాయి పెట్టిన పరిమితులతో అసలుకే మోసం వచ్చి కూర్చుంది.

ఏది ఏమయినాసరే మహారాణీ సమేతంగా యూరప్ పర్యటన చేసి రావలసిందే ననుకున్నారు మహారాజావారు,

కానీ, వైస్రాయి మొండిపిండం.

అందుకని మహారాజావారు ఆలోచించేరు, సుదీర్ఘంగా ఆలోచిం చేరు. గాఢంగా నిగూఢంగా అంతరంగికుల్తోకూడా ఆలోచించేరు.

చివరికి ఓ సుదినాన మహారాజావారు బొంబాయిలో అనేకమంది ప్రభుత్వాధికార్ల సమక్షంలో సపరివారంగా ఓడ నెక్కారు.

వారలా ఓడనెక్కి తమకు కేటాయించిన ఇంద్రుడి పడగ్గదిలాంటి గదిలో అడుగు పెట్టేరు. శ్రీవారి పరివారంలో అంగరక్షకుడుగా ఉన్న ఓ సిక్కు యువకుడు తప్ప మిగిలిన వారంతా వేరేగదిలో సర్దుకున్నారు గది తలుపులు మూయగానే సదరు సిక్కు యువకుడు నెత్తిమీద పాగా, తొడుక్కున్న బట్టలూ ఊడదీసేసి ఓ అప్సరసగా మారిపోయేడు.

ఆ అప్సరసే మహారాణి కనరీదేవి.

ఆ విధంగా మహారాజావారు తమపంతం నెగ్గించుకున్నారు. ఆవిడ ఏకాంతంలో కనరీదేవిగా, నలుగురి మధ్యా మహారాజావారి అంగరక్షకుడైన సిక్కు యువకునిగా మారిపోతుండేది.

యూరప్‌లో మహారాజావారి కనేకమంది ప్రభుకుటుంబాలవారు ఆత్మీయ మిత్రులు. మహారాజావారు వారి అతిధులుగా ఉండగా వారందరూ శ్రీవారి రహస్యాన్ని భద్రంగా కాపాడేరు. ఆ విధంగా మహారాజావారు మహారాణీతోపాటు యూరప్ యాత్రను స్వర్లోకయాత్రగా ఆనందమయం చేసుకున్నారు.

అలా కొన్ని మాసాలపాటు వారిరువురూ యూరప్‌లో హనీమూన్ గడిపేశాక భారత దేశానికి తిరిగి వేంచేసేరు.

బొంబాయిలో శ్రీవారిని వైస్రాయి తరఫున బొంబాయి గవర్నర్ గారి మిలటరీ సెక్రటరీ సగౌరవంగా ఆహ్వానించేరు. వారివెంట అనేక మంది బ్రిటిష్ ఉన్నతోద్యోగులూ ఉన్నారు.

కానీ... !

వారిలో ఏ ఒక్కరూ మహారాజావారి వెంటనున్న సిక్కు యువకుడిని సాక్షాత్తూ శ్రీవారి మహారాణీగా పోల్చుకోలేక పోయేరు.

విజయగర్వంతో కోటకుచేరిన హిజ్ హైనెస్ మహారాజా జగత్‌జిత్ సింహజీవారు ఆప్తులకూ, అంతరంగికులకూ బ్రహ్మాండమైన విందు చేసేరు.

ఆ మహారాణి కనరీదేవి ముద్దుల బిడ్డయే యువరాణి అమృతకౌర్.

★